# హరి మూర్తి








మా నాన్నగారి పేరు హరి రామారావు గారు. పుట్టి పెరిగిన ఊరు బొబ్బిలి విజయనగరం జిల్లా. నాన్నగారు వాళ్ళు ఐదుగురు అన్నదమ్ములు, నలుగురు అక్కలు. అందరిలోకి మా నాన్నగారే ఆఖరివారు కావడంతో చాలా గారాబంగా పెరిగారు. చిన్నతనంలోనే తన నాన్నగారిని పోగొట్టుకోవడం వల్ల పెద్దన్నయ్య, వదినల పెంపకంలో పెరిగారు. వారి పెద్దన్నయ్యగారి హయాంలో సిరిసంపదలకు లోటు లేదు. ఆ రోజులలో బొబ్బిలిరాజుగారితో సరితూగగల ఆస్తులు అగ్రహారంలో ఉండేవి. (అంటే జమిందారీ తనం). అందరిలోకి చిన్నవారైన మా నాన్నగారు కష్టం అంటే ఏమిటో తెలియకుండా పెరిగారు. వారి నలుగురు అన్నదమ్ములతో కలిసి ఆ బొబ్బిలి అంతస్థులో సమిష్టిగా ఉండేవారు. వారి కుటుంబానికి "బొబ్బిలి హరి వారు" అని పేరుండేది. ప్రతి నిత్యం వచ్చిపోయే అతిథులతో, ఇంటినిండా నౌకర్ల ఎంతో వైభవంగా రోజులు గడిచేవట. పెద్దన్నయ్య అడుగుజాడలలో పెరిగిన మా నాన్నగారికి, మంచి కుటుంబ సాంప్రదాయాలు బంధు ప్రీతి అలవడ్డాయి.

మా నాన్నగారు బొబ్బిలి సంస్థాన్ హైస్కూలులో 1956 లో SSLC చదివారు. తరువాత హెల్త్ ఇన్స్‌పెక్టర్ కోర్సుని ఆంధ్రా మెడికల్ కాలేజీ వాల్తేరులో 1957 లో పూర్తి చేశారు. తరగని ఆస్థులు ఉన్నందున, ఉద్యోగం చేయవలసిన అవసరం లేకపోయినప్పటికి, ఎలాగైతేనే పెద్దన్నయ్యను ఒప్పించి, భిలాయ్ స్టీల్ ప్లాంట్లో 1958లో ఉద్యోగరీత్యా జాయిన్ అయ్యారు. అదే సమయంలో జమిందారీ పద్ధతిని రద్దు చేస్తూ వచ్చిన లాండ్ సీలింగ్ ఏక్ట్ వల్ల వారి కుటుంబాలకు చాలా నష్టం జరిగింది. వారి ఆధీనంలో ఉండే తొమ్మిది అగ్రహారాలలో ఒక్క అగ్రహారం మాత్రమే మిగిలింది. ఆ ఉన్న ఒక్క అగ్రహారాన్ని, అన్నదమ్ములకి, అక్క చెల్లెళ్ళకి పంచారు. పెద్దన్నయ్య ఆదేశం మేరకు 1959లో నాన్నగారు భిలాయ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగానికి స్వస్తి చెప్పి తన వాటా 60 ఎకరాల భూమిని నిలబెట్టుకొనటానికి అందరు అన్నదమ్ములతో "శీతమాంబాపురం" (పార్వతీపురం నుంచీ 6కిలోమీటర్లు) అనే గ్రామంలో స్థిరపడ్డారు. 1960లో మా నాన్నగారికి వివాహమయింది. మా అమ్మగారైన శ్రీమతి హరి కామేశ్వరితో శీతమాంబాపురం గ్రామంలో నివాసం సాగించారు.

చిన్నతనం నుంచీ ఇతరులకు సహాయం చేయటం అంటే నాన్నగారికి చాలా ఇష్టం. చిన్న గ్రామంలో, కనీస సదుపాయాలు లేని ప్రదేశంలో ఉన్నందుకు ఏమాత్రం

చింతించలేదు మా అమ్మ, నాన్నగారు. తాను నేర్చుకున్న హెల్త్ ఇన్స్‌పెక్టరు కోర్సు అనుభవంతో చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలందరికీ ఉచిత ప్రథమ చికిత్స చేసేవారు. మా నాన్నగారు ఉండే గ్రామంలో కరెంటు లేదు. వాహనాలు పోవడానికి సరి అయిన రోడ్డు లేదు. మెయిన్ రోడ్డు నుంచీ కాలినడక దారి తప్ప మరో మార్గం లేదు. ఆ గ్రామాభివృద్ధికి పాటుపడాలని నాన్నగారు సంకల్పించారు. మొదట ఒక చిన్న ప్రాథమిక పాఠశాలను స్థాపించారు. ప్రభుత్వ సహాయ సహకారం అందకపోవటంతో, ఒక సంవత్సరంలోనే పాఠశాలాభివృద్ధికి గండు పడింది. తరువాత నాన్నగారు పూర్తిగా వ్యవసాయం మీద దృష్టి సాగించారు. ముఖ్యంగా ఆ ప్రాంతం అంతా వర్షాధార భూములు. దైవాధీన సర్వీస్..ఫలితం అంతంత మాత్రంగానే ఉండేవి.



మా నాన్నగారికి మేము నలుగురు సంతానం. అక్కయ్య, అన్నయ్య, నేను, మా తమ్ముడు. రోజులు గడుస్తున్న కొద్దీ కుటుంబ భారం పెరిగింది. రాబడి తగ్గుతూ వచ్చింది. అయినా నాన్నగారి ఆశయం మారలేదు. తను ఉండే గ్రామానికి అన్ని సదుపాయాలు కలిపించాలనే తపనతో, ముందుగా గ్రామ పంచాయితీ అప్లికేషనుకి నమోదు చేసారు. మా గ్రామానికి ఆ గుర్తింపు రావటంతో నాన్నగారికి మంచి ప్రోత్సాహం లభించింది. దాదాపు 20 సంవత్సరాలు (1962 నుంచీ, 1982) వరకూ గ్రామపంచాయితీ సభ్యునిగా, వైస్ ప్రెసిడెంట్‌గానూ కొనసాగారు. గ్రామాభివృద్ధికై మా నాన్నగారు పలువురు ప్రభుత్వ అధికారులతోను, మంత్రులతోను గ్రామ సమస్యలను వారివద్దకు తీసుకెళ్ళి, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వాటిలో ముఖ్యమైనవి.

1. 1976-77 సంవత్సరంలో శ్రీనివాసరెడ్డి కృష్ణమూర్తి నాయుడు సహకారంతో, 100 మంది గ్రామీణ గిరిజనులకు గృహపట్టాలు, పక్కా ఇళ్ళు సాధించారు.

2. 1973-74 సంవత్సరంలో శ్రీ భాట్టం శ్రీరామమూర్తి (ఎడ్యుకేషన్ మినిష్టర్) సహకారంతో రెండు గ్రామాలలో (అర్తాం, శీతమాంబపురం) ప్రాథమిక పాఠశాలలు స్థాపించి, వాటికి ప్రభుత్వసహకారంతో గుర్తింపు వచ్చేలా కృషిచేశారు.

3. 1979 సంవత్సరంలో గ్రామ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చి పేదరైతులకు ఇరిగేషన్ లోన్సు మంజూరు చేయించి, Dy.Collector గారిచే ప్రశంశలు పొందారు.

4. రాష్ట్రమంత్రులు శ్రీ విజయరామరాజుగారి సహాయంతో 1980లో మా గ్రామానికి రోడ్డు సదుపాయాలు మంజూరు చేయించారు.

5. శ్రీవాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడుగారి సహకారంతో ఎట్టకేలకు 1982 సంవత్సరంలో మా గ్రామానికి విద్యుత్ దీపాలను పెట్టించారు (మాకు మాత్రం కరెంటు దీపాలతో చదువుకునే అదృష్టం కలగలేదు).

ఇలా నాన్నగారు మా గ్రామాభివృద్ధికి పలువురు రాజకీయ నాయకులతో కలిసి ఎంతో ఉత్సాహంగా పనిచేసి, ముఖ్యమైన సదుపాయాలను సమకూర్చారు.

ఇంత బిజీగా ఉన్న నాన్నగారు మాగురించి చాలా శ్రద్ధ తీసుకునేవారు. అక్కకి పెద్ద చదువులు చెప్పించలేకపోయినా, పెయింటింగ్ అంటే అక్కకు ఇష్టమని తెలిసి చాలా ప్రోత్సహించారు. ఆ ప్రోత్సాహం వల్లనే ఈ రోజు అక్క డ్రాయింగ్ టీచరుగా హైదరాబాదులో పనిచేస్తోంది. ఇక మా అన్నదమ్ముల విషయానికొస్తే నేను, అన్నయ్య హైస్కూలు

చదువుకై ప్రతిరోజూ 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్వతీపురం పట్టణం వెళ్ళవలసి వచ్చేది. కనీస సదుపాయాలు లేని ఆ గ్రామంనుంచీ హైస్కూలుకి వెళ్ళడానికి అవస్థపడే ఆ రోజుల్లో, నాన్నగారు సైకిలుపై నన్ను, మా అన్నయ్యను తీసుకుని వెళ్ళి, తీసుకు వచ్చేవారు. ఒక ప్రక్క ప్రజాసేవ, మరో ప్రక్క కుటుంబ బాధ్యతలు, అన్నింటికన్నా మించిన వ్యవసాయ వృత్తి ఒత్తిడి. వచ్చీరాని ఆదాయంతో మా ఆర్థిక పరిస్థితి అప్పులతో సాగేది. ముగ్గురు అన్నదమ్ములము ఒకేసారి చదువుకు రావటం వలన నాన్నగారికి చాలా కష్టపడవలసి వచ్చింది. ఎంత కష్టం వచ్చినా చిరునవ్వుతో ఎదుర్కోవాలన్న సిద్ధాంతం నాకు చాలా నచ్చింది.

అప్పటికి మా గ్రామంలో కరెంటు లేకపోవడం వలన మా అన్నదమ్ముల చదువులన్నీ ఇంటర్‌మీడియట్ వరకూ లాంతరు దీపం దగ్గరే సాగాయి. మమ్మల్ని బాగా చదువుకోమని, మనకున్న ఆస్థి ఆ చదువేనని మా అమ్మ, నాన్నగారు మాకు చాలా సార్లు చెప్పేవారు. మా ముగ్గురు అన్నదమ్ములతో ఒక్కరినైనా డాక్టరు చేయాలన్న మా నాన్నగారి కోరిక ఆర్థిక పరిస్థితికారణంగా ఊహాతీతమైంది. నేను ఇంజినీరింగ్ (జె.ఎన్.టియు కాకినాడలో) చేరినప్పటికి మాకు 10 ఎకరాల పొలము మాత్రమే ఉండేది. తరువాత తమ్ముడు కూడా ఇంజనీరింగ్ లో జాయిన్ అయ్యాక, ఇక పరిస్థితి కటకటలాడింది. మా అన్నదమ్ముల చదువులకీ, అక్క పెళ్ళికీ పది ఎకరాలు అమ్మవలసి వచ్చింది. మా చదువులు పూర్తయ్యాక నేనూ, అన్నయ్య 1989 వ సంవత్సరంలో ఉద్యోగంలో జాయిన్ అయ్యాము. ఇద్దరమూ ఒకేసారి అందిరావటంతో కొంచెం ఊరట కలిగింది. అప్పుడు అమ్మని. నాన్నగారిని మావద్దకు తీసుకుని వచ్చాము. స్వంతగ్రామంలో దాదాపు 30 సంవత్సరాలు గడిపిన అమ్మకు, నాన్నగారికి ఆ ఊరువదిలి రావాలంటే చాలా కష్టమనిపించి కళ్ళు చెమ్మగిల్లాయి. ఆగ్రామాన్ని విడిచి వచ్చేముందు, మేముండే ఆ ఇళ్ళ స్థలాన్ని ఆగ్రామవాసులకి పంచి ఇచ్చారు. ఇప్పటికీ మానాన్నగారు అంటే ఆ చుట్టుప్రక్కల గ్రామస్తులందరికీ ఎనలేని అభిమానం.

ఇలా 1989 సంవత్సరంలో విశాఖపట్టణంలో ప్రారంభించిన మా పట్టణ కాపురం, అన్నయ్య కుటుంబంతో నా కుటుంబంతో, అమ్మా నాన్నగారితో 1997 వరకు సమిష్టి కుటుంబంగా ఉన్నాము. తరువాత నేను 1997లో అమెరికా రావడం జరిగింది. అమ్మా,నాన్నగారు అమెరికాకు (2001, 2006 సంవత్సరాలలో) రెండుసార్లు వచ్చారు. రెండుసార్లు కూడా మా గృహప్రవేశం సందర్భంగా అమెరికా రావడం జరిగింది. ప్రస్తుతం అమ్మా,నాన్నగారు విశాఖపట్టణంలో అన్నయ్య కుటుంబంతో ఉంటున్నారు. అక్క, బావగారు వాళ్ళు హైదరాబాదులో ఉంటున్నారు. అన్నయ్య L.I.C of India మానేజరుగాను, తమ్ముడు 'కువైట్'లో ఇంజినీరుగా కుటుంబంతో స్థిరపడ్డారు.

ఈ విధంగా మమ్మల్ని క్రమశిక్షణతో తీర్చి దిద్దిన అమ్మా, నాన్నగారికి మేము సర్వదా కృతజ్ఞులం.



